# సతీ సావిత్రి

రజని కిటికీ దగ్గరికి వచ్చి నిలబడింది.

కిటికిలో నుంచి కత్తిరించిన నల్లని కాయితం ముక్కలాగా కనిపిస్తున్న ఆకాశంలో నక్షత్రాలు బొత్తిగా లేవు.

పిలిస్తే బదులు పలుకుతుందేమో అన్నంత దట్టంగా చిక్కగా వుంది చీకటి. ఆకాశంలో అలజడి యుద్ధానికి సన్నద్ధమవుతున్న గజసైన్యంలా జలావర్ణమైన మబ్బులు గర్జిస్తున్నాయి. ఇప్పుడో, మరి కాస్సేపటిలోనో కుంభవృష్టి ప్రారంభం అయ్యేట్టు ఉన్నది. వర్షం మొదలైతే ఇక ఆగదు. ఆకాశంనుంచి ఏవో అదృశ్యశక్తులు భూమిని బలమైన తాళ్ళతో పైకి లాగుతున్నట్టే కురుస్తుంది.

రజని ఇవతలికి వచ్చి చాపమీద కూర్చున్నది. చిన్న గది. గోడ పక్కనే పాత ట్రంకు పెట్టె... కిటికీ ఇవతలగా చిన్న ఫోటో. అందులో కొత్తగా పెళ్ళయిన దంపతులు. రజని అందులో కుర్చీకి చెయ్యి ఆనించి సిగ్గుతో తల వంచుకుని నిలబడి వుంది. ప్రభాకర్ కుర్చీలో గంభీరంగా కూర్చుని వున్నాడు. సన్నటి మీసాలు. పెద్ద నుదురు. ఎదిగిన చెంపలు. పెద్ద పెద్ద కళ్ళు... అంత సన్నటి మనిషీ అకస్మాత్తుగా పోయాడు. రజనికి మిగిలింది అయిదు నెలల పసికందు.

రజని పమిటకొంగు దగ్గరగా లాక్కుని చెవులు చుట్టూ కప్పుకుని పెట్టె తెరిచింది. ఏదో రెండు పుస్తకాలు... ఒక చిన్న ఫైలు... రెండో మూడో చీరెలు, జాకెట్లు. ప్రభాకర్ తాలూకు ఎప్పటిదో డైరీ... అందులో అక్కడక్కడా మామూలు లెక్కలు తప్ప ఎక్కువ పేజీలు ఖాళీ... రజని ఫైలుతిప్పింది. బుద్ధిగా చదువుకున్నందుకు ఫలితంగా వచ్చిన డిగ్రీ ట్రైనింగ్ సర్టిఫికెట్. మొదటి హిందీ పరీక్ష ప్యాసైన సర్టిఫికెట్. ఏవో అప్లికేషన్ల కాపీలు, ఇటీవల తనను పనిలేదని ఉద్యోగంలో నుంచి తీసేస్తూన్నట్టు స్కూలు వారిచ్చిన నోటీసు... దస్తూరీ సరిగా తెలియకుండా గందరగోళంగా ఉన్న ఒక మనియార్డరు రశీదు, రజని నిట్టూర్చింది. దీపంలో కిరసనాయిలు అయిపోయినట్టున్నది. వెలుగు మందగిస్తున్నది. పైన ఆకాశంలో మబ్బుల కోలహలం పెరుగుతున్నది. పక్క గదిలోకి వెళ్ళే తలుపు మూసి ఉంది. సావిత్రి ఇప్పుడల్లా రాదు. తెల్లవారుతూ వుండగా గాని రాదు.

సావిత్రి ఎర్రగా వుంటుంది. అంత లావు, అంత సన్నమూ కాదు. మొహాన చిన్న చిన్న ఎర్రని మచ్చలుంటాయి. ఎనిమిదో తరగతి వరకూ చదివానని చెబుతూ వుంటుంది. చదువుకునే రోజుల్లో తాను మరీ సన్నగా ఎర్రగా వుండేదనీ, అందరూ తనకు "ఎర్ర తేలు" అని పేరు పెట్టారనీ కూడా చెప్పిందొకసారి. రోజూ రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటలవేళ సింగారించుకుని బయల్దేరి వెళ్ళిపోతుంది. ఒక్కోసారి మొదటి ఆట సినిమాకు వెళుతుంది. కాని మళ్ళీ తెల్లవారుజాము వరకు రాదు. సావిత్రి కెవరూలేరు. రజనికీ ఎవరూ లేరు. ఆ పసిపిల్ల విజ్జీ తప్ప.

సావిత్రి విజ్జీని చంకన వేసుకుని వెళుతున్నది రెండు మూడు రోజులుగా. రాత్రల్లా పసిదాన్ని ఎక్కడ పడుకోబెడుతుందో, ఏం చేస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి.

సావిత్రి మనిషి మంచిదే. రజని ఉన్నట్టుండి ఉద్యోగం పోయి బాధలో ఉంటే సావిత్రి ఆదరించింది. ఏం సంపాదిస్తుందో, ఎలా సంపాదిస్తుందో రజనికి ఆమె ఎప్పుడూ చెప్పలేదు కాని, రజనికూడా అంత లోకం తెలియని అమాయకురాలేమీ కాదు. ఆమెకు తెలియక పోలేదు. కాని ఎప్పుడూ పైకి తేలలేదు. ఈ పది రోజుల పరిచయంలోనూ రజని తాను అసలు ఏమీ తెలియనట్టే మెలగుతూ వచ్చింది. కాని రెండు మూడు రోజుల నుంచి తనను బతిమలాడి, ఒత్తిడిచేసి విజ్జీని ఎత్తుకుపోతుంటే బాధగా ఉండి కూడా రజని ఎదురు చెప్పలేదు. ఇవాళ మాత్రం ఆమె మనసెందుకో వికలంగా ఉంది. బయటి ప్రకృతిలాగే ఆమె మనసులో కూడా ఎందుకో కారణంలేని అలజడి. మాటిమాటికి కళ్లెందుకో చెమరుస్తున్నాయి. ఆమె లేచి మళ్ళీ కిటికి దగ్గర నిలబడి బయటికి చూసింది. అకస్మాత్తుగా చల్లనిజల్లు ఆమె మొహంమీద కొట్టినట్టయింది. శరీరం జలదరించింది. కొద్ది క్షణాల్లో గాలి విసురు తగ్గి వర్షం నిలిచి కురవడం ప్రారంభించింది. రజని పమిటితీసి మళ్ళీ వేసుకుంది. జాకెట్ మొనలు తడిసి వున్నాయి. గదిలో లాంతరు కొడిగట్టి వెలుగు పూర్తిగా మందగించింది.

◆ ◆ ◆ ◆ ◆ ◆

“ఇంత వర్షం యీ మధ్య ఎప్పుడూ చూడలేదు” అనుకున్నది సావిత్రి. వీధి చివరి వరకూ లైట్లు మందంగా వెలుగుతున్నాయి. చిన్న వరండాలో చివరగా నిలబడివుంది ఆమె... భుజంమీద విజ్జి నిద్రపోతున్నది. వర్షం చప్పుడుచేస్తూ కురుస్తున్నది. వీధి నిర్మానుష్యంగా ఉంది. ఉండి ఉండి ఒక్కొక్క రిక్షా గుంటలలో పడుతూ లేస్తూ వెడుతున్నది. ఆ వరండా చిన్నది. రోడ్డు మీదికి వుంది. ఇల్లు మాత్రం ఎవరిదో, తాళం వేసి వుంది. వరండా అవతలి చివర ఒక నడివయస్కుడు స్తంభం ఆనుకుని నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు.

సావిత్రి అతనితో మాటలు కలిపింది, కొద్దిగా వొణుకుతూ.

“ఈ వాన తగ్గేట్టు లేదు” అన్నది.

అతడు తలతిప్పి చూశాడు. చూసి సిగరెట్టు నుసి విదిలిస్తూ “అవును. తగ్గేట్టులేదు. ఒక రిక్షా వొచ్చినా బాగుండును ఇంటికి పోవచ్చు–” అన్నాడు.

సావిత్రి మరేమీ మాట్లాడకుండా కాస్సేపు అతని వంక చూస్తూ నిలబడింది. అతడు కొద్ది క్షణాలాగి “మీరెక్కడికి వెళ్ళాలి?” అని అడిగాడు.

సావిత్రి అతని దగ్గరగా వచ్చి “ఏదీ...అరగంట క్రితమే రైలు దిగాను. మళ్లీ హైదరాబాదు రైలు తెల్లవారితేగాని లేదు. ఏం చెయ్యాలో తోచటంలేదు. పైగా ఈ వాన...” అన్నది.

అతడు ఆమె వంక నిదానించి చూశాడు. తర్వాత ఏమనుకున్నాడో ఏమో, సిగరెట్టు పారేసి “మాయింటికొస్తే... రాదలచుకుంటే రావచ్చు... ఇంట్లో ఎవరూలేరు. తెల్లవారిన తర్వాత రైలుకు పోవచ్చు...” అన్నాడు.

సావిత్రి నెమ్మదిగా “డబ్బులేదు పర్సు పోయింది...” అన్నది.

అతను అనుభవజ్ఞుడు... అర్థం చేసుకున్నాడు. నేనిస్తాను. ఖాళీ రిక్షా వొస్తే వెడదాం మా ఇంటికి. ఇల్లు విడిగా వుంటుంది. ఏ యిబ్బందీ వుండదు. డబ్బెంత కావాలి?” అన్నాడు.

సావిత్రి ముందు 'మీ యిష్టం' అని తర్వాత 'యాభై ఇవ్వండి' అన్నది. అతడు తల వూపాడు. ముందుకువంగి వీధి చివరకు చూశాడు. రిక్షాకోసం...నిలువెల్లా రెయిన్ కోటూ, తలపైన టోపీ ధరించి సైకిల్ మీద ఒక పోలీసు వస్తున్నాడు. ఇందాక అతడు ఇటే వెళ్ళాడు. మళ్ళీ ఇటే వస్తున్నాడు. వరండాలో నిలబడ్డ వీరిద్దరి వంకా ఇందాక వెడుతూ చూశాడు. ఇద్దరు చెరొక వైపు నిలబడి వున్నారిందాక. ఇప్పుడు దగ్గరగా చేరారు. వెడుతూ తల తిప్పి సావిత్రి వంక చూశాడు. అతనికి అనుమానం వేసింది. 'ఇది పాత కేసు లాగుందే' అనుకున్నాడు. అంతలో అతనికి గుర్తు వచ్చింది. కేవలం నెలరోజులు కూడా కాలేదు. ఒక లాడ్జింగులో తాను స్వయంగా పట్టుకున్నాడామెను. అతడిప్పుడు ప్రశాంతంగా ముందుకు వెళ్ళి వీధి చివర ఆగాడు.

రిక్షా ఒకటి పోతున్నది. ఆవ్యక్తి "ఏయ్ రిక్షా ఖాళీయేనా!" అని అడిగాడు పెద్దగా.

రిక్షా వరండా పక్కకు వచ్చి మెట్లక్రింద ఆగింది. ఆ వ్యక్తి రిక్షా మాట్లాడి సావిత్రి వంక తిరిగి "పద" అన్నాడు. ఇద్దరూ కూర్చున్న తర్వాత రిక్షా కదలింది. వీధిలో చిన్న చిన్న గుంటలలో నీళ్లు నిలిచి వున్నాయి. రిక్షా మలుపు తిరిగింది.

అతడు సావిత్రి భుజం మీద చెయ్యివేశాడు. తర్వాత నెమ్మదిగా! "పిల్లా?పిల్లవాడా?" అని అడిగాడు.

"పిల్లే... అయిదు నెలలు" అన్నది సావిత్రి. ఈ మాటలు అని అతని వంక మందమైన వెలుగులో నవ్వుతూ చూసింది.

ఉన్నట్టుండి రిక్షా ఆగింది. "ఏమిటి"? అన్నాడతను ముందుకు చూసి. ఎదురుగా పోలీసు నిలబడి వున్నాడు. అతని రెయిన్ కోటుమీద నీళ్ళుపడి వీధి దీపం వెలుతురులో మెరుస్తూ క్రిందికి జారుతున్నాయి. సావిత్రి భుజంమీద విజ్జీని రెండో భుజంమీద మార్చుకుంది. "ఏమిటి?" అని అడిగాడు అతను పోలీసు నుద్దేశించి.

పోలీసు సైకిల్ స్టాండువేసి "ఆవిడ ఎవరు?" అని అడిగాడు.

ఆ వ్యక్తి కొంచెం సందేహిస్తూనే లో గొంతుకతో 'నా భార్య' అన్నాడు. అతని గొంతు అతనికే చిత్రంగా వినిపించింది.

"ఏమిటిసార్ పెద్దవారు, చదువుకున్నవారు, ఎందుకబద్ధాలు చెబుతారు. వొళ్ళమ్ముకునే ఆడదాన్ని పట్టుకుని భార్య అని చెప్పేంత ఖర్మ ఏం పట్టిందండీ సార్ మీకు?"

ఆ వ్యక్తి గతుక్కుమన్నాడు. సావిత్రికి గుండెలు జల్లుమన్నాయి. పోలీసు సావిత్రి నుద్దేశించి "ఏయ్? నిన్ను ఎన్నిసార్లు స్టేషనుకు తీసుకువెళ్ళలేదు నేను?నీ పేరేమిటి?" అన్నాడు.

"సావిత్రి" అన్నదామె నెమ్మదిగా.

"సరే... స్టేషనుకు పదండి!"

ఆ వ్యక్తి గాభరాపడిపోయాడు. కళ్ళముందు ఆఫీసూ, పరువు ప్రతిష్ఠలు గిర్రున తిరిగాయి. ఉన్నట్టుండి రిక్షాదిగి పోలీసుతో 'నేను...నేను' అంటూ నసుగుతున్నాడు.

"ఏమిటండి... ఏమిటి మీరనేది?" అన్నాడు పోలీసు. ఆ వ్యక్తి పోలీసును పక్కకు తీసుకువెళ్లి నెమ్మదిగా మాట్లాడటం సాగించాడు. సావిత్రి పాము గొంతుకలో పడిన

ఎలుకలా నిస్సహాయంగా కూర్చుండి పోయింది. అతని మాటలలో "ఆఫీసు తప్పదు...వెళ్లి తీరాలి. ఈసారికి చెడ్డపేరు..." అని కొన్ని మాటలు మాత్రం వినిపించాయి.

తర్వాత కృతార్థుడయిన పోలీసు "సరే మీరు వెళ్ళండి" అనడం వినిపించింది. సావిత్రి తల పక్కకు తిప్పి చూస్తే ఆ వ్యక్తి వర్షంలో పెద్ద పెద్ద అంగలు వేస్తూ నడిచిపోవడం కనిపించింది.

పోలీసు రిక్షావాడితో 'పదరా. స్టేషనుకు పోనియ్' అని తాను సైకిలెక్కాడు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

చిన్న కటకటాల గదిలో నలుగురు ఆడవాళ్ళున్నారు. మాసిన చీరెలతో, ప్లాస్టిక్ పూసల గొలుసులతో, జాకెట్ల వెనక నూనెడాగులతో తాంబూలం వల్ల గారపట్టిన పళ్ళతో, తలల్లో వాడిన పూలతో-వాడిన పూలకు మల్లే చూడగానే వ్యభిచారిణులని అర్థమైపోతున్నది.

తలుపు 'కీచు' మని చప్పుడుచేస్తూ తెరుచుకున్నది. సావిత్రిని పిల్లతో సహా లోపల ప్రవేశ పెట్టి మళ్లీ తలుపు మూశాడు. లోపలవున్న వారందరూ ఆమెవంక ఒకసారి చూసి మళ్లీ మామూలుగా సర్దుకున్నారు. సావిత్రి కొద్ది క్షణాలు గోడకానుకుని నిలబడి తర్వాత అలాగే కూలబడింది. పిల్లను వొళ్లో పడుకోబెట్టుకుంది. గుడ్డ సరిగా కప్పింది. కొంగు తల చుట్టూ తిప్పి చుట్టుకుని ఒక్క క్షణం కళ్లు మూసుకున్నది. ఆమెకు అంతలో రజని గుర్తుకు వచ్చింది.

బయట వర్షం భూమిమీద మబ్బులు పగబట్టినట్టు, కసి తీర్చుకుంటున్నట్టు ఎడతెగని వర్షం.

కటకటాలకవతల ఒక పోలీసు స్టూలు మీద కూర్చుని బీడీని శ్రద్ధగా కాలుస్తున్నాడు. కాలుస్తూ అందులో ఆనందం అనుభవిస్తున్నట్టు ఉండి ఉండి పారవశ్యంతో కళ్లు మూసుకుంటున్నాడు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

సావిత్రి ఉలిక్కిపడి కళ్లు తెరిచింది.

అర్ధరాత్రి దాటి వుంటుంది. పిల్ల ఎప్పుడు మేలుకున్నదో ఏమో, ఏడుస్తున్నది. పెద్దగా ఏడుస్తున్నది.

సావిత్రి సర్దుకుని కూర్చుని పిల్లను సముదాయించే ప్రయత్నం చేసింది. చుట్టూ చూసింది.ఎక్కడి వారక్కడ కునుకుతున్నారు.

పిల్ల ఏడుపు విని ఒకామె కళ్లు తెరిచి కాస్సేపు చూసి ఉన్నట్టుండి నవ్వి "నలుసంతలేదు... పెద్ద గొంతే..." అన్నది.

సావిత్రి చేత్తో పసిదాని పొట్టమీద కొడుతూ సముదాయిస్తున్నది. కాని ఫలితం లేకపోయింది. కటకటాల కవతల స్టూలు మీద వున్న పోలీసు ఆవులిస్తూ, చిటికెవేసి, "ఏయ్!ఎవరిది? ఏమిటాగోల?" అని అడిగాడు.

అవతలి ఆమె అకారణంగా నవ్వుతూ "ఏమున్నదీ? పసిపిల్ల ఏడుస్తున్నది" అన్నది సమాధానంగా.

అతడిది విని "అది తెలుస్తూనే వుంది" అన్నాడు తర్వాత సావిత్రి నుద్దేశించి "ఏయ్ ఆకలై ఏడుస్తున్నదేమో? పాలివ్వు పడుకుంటుంది..." అన్నాడు. సావిత్రి గతుక్కుమన్నది. నిజమేనేమో పైకి మాత్రం "కడుపులో నొప్పో ఏమో" అన్నది.

"పాలివ్వ ముందు లేకపోతే రాత్రల్లా అందరికి తలనొప్పి" అన్నాడు పోలీసు గొంతు పెద్దదిచేసి.

అవతలి ఆమె "అవును ఆకలై ఏడుస్తున్నది. పాలివ్వ..." అన్నది. సావిత్రి ఇరకాటంలో పడింది. పిల్ల ఏమో ఏడుపు మానలేదు. సరికదా ఎవరో తొడపాశం పెట్టినట్టు పెద్ద గొంతుకతో 'కెవ్వు కెవ్వున ఏడుపు సాగిస్తున్నది.

సావిత్రి సముదాయించే ప్రయత్నం మానలేదు. పిల్ల ఏడుపు మానలేదు. కునుకు తీస్తున్న వారందరికీ మెలకువ వచ్చింది. అందరూ కళ్లు పెద్దవి చేసుకుని చూస్తూ కూర్చున్నారు.

బయట కూర్చున్న పోలీసు మళ్ళీ పెద్దగా "ఏవమ్మోవ్! ఏమిటీ న్యూసెన్సు? పాలిచ్చి పడుకోబెట్టమంటే వినిపించుకోవేం?" అని, మళ్ళీ "అర్ధరాత్రివేళ ఈ గొడవ ఏమిట్రా దేవుడా" అనుకున్నాడు అందరికీ వినిపించేట్టుగానే. తర్వాత లోపలికి వెళ్ళి 'గణగణ' మోగుతున్న ఫోను అందుకుని ముందు వినయంగా "హల్లో! ఎవరండీ?"అని ప్రారంభించి, ఆతర్వాత పెద్దగా "ఏమిటి? అయ్యా! ఇది హాస్పిటల్ కాదండీ బాబూ! నా మాట వినండి ముందు.

ఇది హాస్పిటల్ కాదు...పోలీసుస్టేషను. బోధపడిందా? అవునవును. రాంగ్‌నంబర్" అంటూ మాట్లాడి పెట్టేశాడు.

పసిపిల్ల యేడుపు మానలేదు. మరింత గొంతు పెంచి యేడుస్తున్నది. ఒకామె ఆవులిస్తూ "మా ప్రాణాలు తియ్యక పాలిచ్చి పడుకోబెట్టమ్మా తల్లీ" అన్నది.

పోలీసు బీడీ వెలిగించుకుని పొగ వూదుతూ "ఇక ఊరుకో నమ్మాయ్! ఇంతమంది చెబుతుంటే వినిపించుకోవేం? అయినా ఏంపోయే కాలం వచ్చి పడ్డిందిరా దేవుడా! పిల్ల అట్లా ఏడుస్తుంటే రాయిలా కూర్చుంటావు. నువ్వేం తల్లివి" అన్నాడు కోపంగా.

సావిత్రి అన్నీ వింటూ శిలా ప్రతిమలా కూర్చుండిపోయింది.

కాస్సేపటిలో పరిస్థితి విషమించింది. అందరికి నిద్రాభంగం కావడంతో అందరూ తలా ఒక మాట అంటున్నారు. గొణుగుతున్నారు.

సావిత్రికి మెదడు మొద్దుబారిపోయినట్టున్నది. కొయ్యబొమ్మలా చలనం లేకుండా కూర్చుండిపోయింది.

బయట వర్షం ఇంకా జోరుగా కురుస్తూనే వుంది. పిల్ల ఇంకా పెద్దగా ఏడుస్తూనే వుంది.

సావిత్రి జాకెట్టులోంచి చిన్న పర్సు తీసి డబ్బులు లెక్కపెట్టుకున్నది. మొత్తం తొమ్మిది రూపాయలు పైన కొంచెం చిల్లర ఉంది. ఆమెకు తల తిరిగినట్టయింది. రేపు బయట పడేందుకు ఖర్చెంత అవుతుందో ఏమో తెలీదు. ఈ అనుభవం ఆమెకు కొత్త కాకపోయినప్పటికి ఇంత చికాకుగా ఎప్పుడూ లేదు. ఈ పిల్లతో పెద్ద బెడద వచ్చిపడింది. అంతలో ఆమె చిగురాకులా వొణికిపోయింది. ఒక నిమిషం తర్వాత విపరీతంగా ఏడుస్తున్న పసిదాన్ని క్రింద పడుకోబెట్టి లేచి కటకటాల దగ్గరికి వచ్చి నిలబడింది.

పోలీసు కళ్ళతోనే "ఏమిట"ని ప్రశ్నించాడు.

సావిత్రి ఒక రూపాయి నోటు ఇవతలికి తీసి "పిల్లకు పాలు కావాలి" అన్నది.

అతడు కనుబొమ్మ లెగరవేసి "అది తెలుస్తూనే వుంది. అయితే ఏం చెయ్యమంటావు? నన్నిమ్మంటావా?" అని అడిగాడు ఎగతాళిగా. లోపల ఎవరో నవ్వారు.

సావిత్రి ఒక్క క్షణం ఆగి "అది కాదు. పక్కన ఎక్కడన్నా చిన్న హోటలుంటే పాలు తెచ్చుకుంటానూ" అన్నది.

పోలీసు తల అడ్డంగా ఊపి "వీల్లేదు" అన్నాడు.

"పోనీ, మీరు వెళ్ళి తెచ్చిపెట్టండి....పసిపిల్ల గొంతు కెండుకుపోయి అల్లాడి పోతున్నది" అన్నది సావిత్రి.

అతడు కళ్లు పెద్దవిచేసి చూశాడు. "ఏమిటి? ఈ వానలోనా? భలేదానివే. అయినా నీ సంగతి చిత్రంగా వుందే...అసలు ఒక మాట చెప్పు. ఇందాక రైటర్ గారికి ఏం చెప్పావు? ఆ పిల్ల నీ పిల్లే కదా!" అని అడిగాడు.

సావిత్రి "అవున"ని తల వూపింది.

"అయితే...పిచ్చి వేషాలు కట్టిపెట్టి పాలివ్వు."

సావిత్రి స్థాణువులా నిలబడిపోయింది.

పిల్ల ఏడుపు తగ్గేట్టులేదు. బయట వర్షం తగ్గేట్టులేదు.

పిల్ల ఏడుస్తూనే వుంది. కాకపోతే ఓపిక తగ్గి నెమ్మదిగా.

వర్షం తగ్గుముఖం పట్టింది.

నెమ్మది నెమ్మదిగా తెల్లవారింది. ముందు పక్షుల కలకలం. కాకుల అరుపులు. తర్వాత సన్నని వెలుగు. ఆ పైన బంగారు రంగుఎండ. ఇలా తీరికగా, నెమ్మదిగా తెల్లవారింది.

ఒకామె "ఏం పిల్ల, ఏం పిల్ల...రాత్రల్లా ఏడుస్తూనే వుంది..." అన్నది.

పోలీసు "ఏం తల్లి...ఏం తల్లి... పిల్ల అట్లా ఏడుస్తుంటే రాయిలా కూర్చుందే తప్ప పాలివ్వలేదు..." అనుకున్నాడు.

◆ ◆ ◆ ◆ ◆ ◆

కళ్ళజోడు బల్లమీద వుంచి కళ్ళు నులుముకుంటూ పోలీసుల కథనం విన్నాడు న్యాయమూర్తి. తర్వాత కాస్సేపు పైన కదలుతున్న గుడ్డ పంఖాకేసి చూశాడు. ఆడవాళ్ళందరిదీ ఒకటే నేరం. వ్యభిచారం.

ఆయన అంతలో ఏదో గుర్తుకు వచ్చినట్టు కళ్ళజోడు అందుకుని మొహానికి తగిలించుకుని అలవాటు ప్రకారం "ఒక్కొక్కరికి యాభై రూపాయలు జరిమానా, చెల్లించకపోతే నెల రోజుల విడి ఖైదు" అని చివాలున లేచి వెళ్ళిపోయాడు.

సావిత్రికి గుండెలు దడదడ లాడాయి. మిగిలిన ఆడవాళ్ళకు కావలసిన వారెవరో వచ్చారు. జరిమానాలు చెల్లించారు. కొద్దిసేపట్లో అంతా వెళ్ళిపోయేందుకు సిద్ధపడ్డారు.

పోలీసు తల వూపుతూ "నీ సంగతి?" అని అడిగాడు.

సావిత్రి మాట్లాడలేదు.

ఈదురుగాలి వీస్తున్నది. కోర్టు ఆవరణలో వరండాలో అలజడిగా వుంది.

ఒంటిగంట దాటి వుంటుంది.

"ఇంకా నిలబడే వున్నావేం?"

సావిత్రి తలయెత్తి చూసింది. ఎదురుగా మాణిక్యం...ఆరడగుల భారీ మనిషి... నల్లగా, లావుగా ఉంది. నవ్వుతున్నది. గారకట్టిన పళ్ళు బయటకు కనబడుతున్నాయి. ఊళ్ళో ఎక్కడో పడుచు పిల్లలను చేర్చి వ్యభిచార గృహం నడుపుతూ వుంటుంది.

"డబ్బు లేదు" అన్నది సావిత్రి.

"అదీ తెలుస్తూనే వుందిలే...ఈ పిల్ల ఎవరిది?"

సావిత్రి సమాధానం చెప్పలేదు. పిల్ల వీపుమీద ఉన్న చేతికి ఒక్క విషయం మాత్రం తెలుస్తున్నది. ఇంకా అది బతికే వుంది. ఇక ఏడ్చే ఓపిక లేక సొమ్మసిల్లి నీరసంగా పడుకుని వుంది.

మళ్లీ మాణిక్యమే "నెమ్మదిగా నేను కడతాను డబ్బు. పది రోజులపాటు మా ఇంటికి వస్తావా? బొత్తిగా చేతులు తక్కువైపోయాయి" అని అడిగింది.

సావిత్రి కళ్లు మెరిశాయి. "అలాగే" అని తల వూపింది. కళ్లలో నీటిపొర కమ్మింది.

తర్వాత కొద్ది సేపట్లో ఆ తంతు అంతా ముగిసింది.

సావిత్రి గబగబ అడుగులు వేసింది. మాణిక్యం వెనక నడుస్తూ నెమ్మదిగా "గుర్తుంచుకో... ఇవాల్టినుంచే రా, రాత్రి ఏడుగంటలకల్లా మా యింటికి రావాలి. తిండి తిప్పలూ అక్కడే" అన్నది.

సావిత్రి తల వూపిందేగాని ఆగలేదు. త్వరత్వరగా ఆవరణ దాటి బయటికి వచ్చి రిక్షా ఎక్కింది.

◆ ◆ ◆ ◆ ◆ ◆

రజని గుమ్మంలోనే వుంది. రిక్షా ఆగగానే ఆమె ఆదుర్దాగా మెట్లు దిగి ఎదురు వచ్చి చేతులు చాపింది. "ఏమయింది"? అన్నది.

సావిత్రి భయం భయంగా పిల్లవంక ఒకసారి చూసి తర్వాత రజనికి అందించింది.

"ఏమయింది? ఏమయింది?" అన్నది రజని పిల్లనందుకుంటూ సావిత్రి "పాలివ్వు" అన్నదంతే...మరుక్షణంలో తన గదిలోని చాప మీద పడిపోయింది.

అంతలోనే ఆమెకు ఏడుపు పొంగి వచ్చింది.

◆ ◆ ◆